

# రెండు తరాలు

—చందు సుబ్బారావు

అప్పుడలాగే జరిగింది మరి...

చెప్పకపోవటమెందుకూ.. ఇతరులెరుగక పోతే ఈశ్వరుడెరుగడా అన్నారు పెద్దలు..

నాకు మాత్రం ఎన్నేళ్ళున్నాయి.. పద్నాలుగో ఏట రజస్వల అయ్యాను.. పదిహేన్లో పెళ్ళి చేశారు.. పెళ్ళంటే పెళ్ళన్నారుగాని ఏం తెలుసనీ.. శోభనం నాడు వెనక పంచపాళీలో పడుకుని నిద్రపోతే వెతకలేక చచ్చారట.. అర్ధరాత్రి దాటిం తర్వాత లేపుదురుగదా.. పోయి పానుపు మంచం మీద పడుకుని మళ్ళీ లేవలేదు.. ఆ మనిషి ఎక్కడ పడుకున్నాడో కూడా తెలియదు..!

ఆ తర్వాత మాత్రం నాకేం తెలిసిందిలే.. మీకు చెప్పటానికి.. ఆయనకు మునసబుగిరీతోనే సరిపోయేది.. వచ్చేవాళ్ళు.. పోయేవాళ్ళు.. వెట్టోళ్ళకు పనులు పురమాయించటం.. లేకపోతే కాయితాలు రాసుకోవటం...!

తెవారి వెళితే మూడ్రోజులకుగాని తిరిగొచ్చేవాడు కాదు.. జమాబందీలు.. బైండోవర్లు.. కేసులు.. సాక్ష్యాలు అనేవాడు.. ఒకవేళ ఊళ్ళో కొచ్చి ఊరికినే వున్నా.. అదిగో పల్లెలో రాములమ్మ.. కాలవగట్టున సిపాయి కూతురు సిసింద్రీ.. చంద్రక్క.. ఇంకా ఎవరెవరో వుండేవాళ్ళు.. నాకేమైనా తెలుసుగనకనా.. పెళ్ళయిన తర్వాత ఏనాడైనా ప్రహరీగోడ దాటనిచ్చేడు గనకనా.. పండక్కీ పబ్బానికీ పుట్టింటికి పోయినా.. గంటలో వెట్టివాడొచ్చేవాడు.. రెవిన్యూ ఆఫీసరుగారొస్తున్నారు వంట చెయ్యాలట రమ్మని పిలుపు.. వంటా వార్పులతో తెల్లారిపోయింది బ్రతుకంతా.

అర్ధరాత్రి రెండు మూడు జాములు దాటాక నిద్రలో ఎవరో చెయ్యేసినట్లూ.. వొళ్ళంతా కదిలినట్లూ వుండేది.. తెల్లారి నొప్పుల్నిబట్టి 'ఆహా' అనుకునేదాన్ని.. అంతకు మించి ఆయన మగాడనీ.. మొగుడనీ.. ముచ్చటనీ ఎరగను.. పగలెప్పుడన్నా 'కమలమ్మా ఇలారా' అని పిలిచినా

"ఆ దస్తావేజు ఎక్కడ పెట్టావ్..? నా చలువ కళ్ళజోడు కనిపించదేం..? చారల చొక్కా తీసి చాకలికి పంపి యిస్త్రీ చేయించు.. వచ్చే వారం వేలం పాటలున్నాయ్.." అనేవాడు..

అలాగైనా మాట్లాడుతుంటే సరదాగా వుండేది.. కానీ ఏదీ.. ఒక్క క్షణమే మురిపెం.. ఆనక నేనూ.. ఆ లంకంత యిల్లూ.. కసిసం ఆ 'విషయం' జరక్క ముందు పాలేళ్ళూ, జీతగాళ్ళూ తిరుగుతుండేవాళ్ళు.. ఆ తర్వాత వాళ్ళను కూడా లోనికి రానియ్యలేదు. చావిడి ఇంట్లో మంచి ఏర్పించి వేశాడు. ఇంట్లో ముసలిదాన్ని కాపలా పెట్టాడు.. పాలవాడొచ్చినా పూలవాడొచ్చినా ముసల్ది పోయి ముందు ప్రహరీ తలుపులు తీసి తీసుకురావలసిందే.. మగ పురుగు దూరకుండా కట్టడి చేసి నక్కను కాపలా వుంచాడు. ఆ నక్కముండయినా మంచీ చెడూ మాట్లాడేది కాదు. దొడ్లో స్నానమాడుతుంటే తొంగి చూస్తుండేది.. ఎందుకో నాకూ అర్థమయ్యేది కాదు.. తప్పు జరిగింది నిజమే.. అయిపోయింది కదా..

మళ్ళీ జరగకుండా జాగ్రత్తనుకుందామా.. దొడ్లో కూడానా.. అయినా నా ఖర్మ... ఆ నాటికీ యీ నాటికీ 'ఆడ, మగ' అన్నది ఎరగనే ఎరగను.. ఆ రోజు అలా తగలడింది కానీ..! అన్నట్లు అప్పటికి పెళ్ళయి అయిదేళ్ళు.. పిల్లా పాపా లేరు.. మంచి డాక్టరికి చూపిస్తే పిల్లలు పుడతారని అందరూ అనేవారు.. మునసబుగారు వింటేనా..? ఛత్.. ఆడపిల్లను తెవారి తీసుకుపోవటమేమిటి.. కులమింటి కూతురు పట్నంలో డాక్టరు దగ్గరికి వెళ్ళటమా అని సిద్ధాంతి చేత నాటు వైద్యం చేయించేవాడు.

నాటు వైద్యాలకు ఫలితం వుండదని సిద్ధాంతి నాన్న కబురు చల్లగా చెప్పాడు.. కానీ పట్నం పోయేదెట్లా..!

అప్పటికి ఇరవై ఏళ్ళే కదా ఏం వయసొచ్చిందిలే అని అందరూ అనేవాళ్ళు.. నేనూ అట్లాగే అను కున్నాను. కానీ తర్వాత కథ మారిపోయింది కదా..! మొదటి అయిదేళ్ళు కాసింత సందడిగానే వుండేది యిల్లు.. చుట్టాలు, పిల్లలూ వచ్చిపోతుండేవాళ్ళు.. ఆయన లేనప్పుడు చింతపిక్కలనీ, 'దాడి' అనీ, వైకుంఠపాళి అనీ ఆడుకునేవాళ్ళం.. మగపిల్లలు బంతాటా, కోతికొమ్మచ్చి, చెడుగుడూ ప్రహరీ లోపలే ఆడుకునేవాళ్ళు.. మునసబుగారు 'ఏమిటా గొడవ పిల్లల్తో' అనేవాడు కాని అంతగా ఆక్షేపించ లేదు ఎన్నడూ.. ఇరవయ్యేళ్ళ ఆడదాన్ని రాత్రుల కంటే పగలే బావుందనిపించేది.. ఈవాడయితే పొద్దుకూకితే ఇళ్లాలూ యింటాయనా ఎంత ముచ్చ టగా వుంటారూ.. రాత్రి అంటే బెంగపట్టుకునేది నాకు.. నిద్దెక్కనేగాని ఎంతకీ తెల్లారేది కాదు.. ఆయన పట్నంల్లో ఏవో రాసుకుంటూ వుంటే పడక టింట్లో నేనుండేదాన్ని.. నాలు కుర్చీలో అట్లాగే నిద్రపోయేవాడాయన.. మీకు నవ్వొస్తుందేమోకాని ఆయనకు నాలుకుర్చీనే పెళ్ళాం అనుకునే దాన్ని!! నాకూ నవ్వొచ్చేది.. అదిగో ఆ తప్పు జరిగింతర్వాత నవ్వు కూడా రాలేదనుకోండి.

ఆ తప్పయినా నేను కావాలని చెయ్యలేదు.. నా మేనమామ కొడుకు సూర్యనారాయణ చాలా చురు కైన కుర్రవాడు.. ఎనిమిదో తరగతి చదువుతూ కొత్త సైకిలు కొన్నాడు. అది చూట్టానికి బలే ముచ్చటగా వుండేది. వాడు దాని మీద మా యింటి చుట్టూ గిరికీలు కొడుతుంటే నాకు బలే సరదా వేసేది. ఆగితే ముట్టుకుని బెల్లు కొట్టేదాన్ని, బ్రేకులు నత్తేదాన్ని.. ఓ రోజు మాట వరసకు 'నాకు నేర్పుతావురా సూర్యం సైకిలు తొక్కటం' అన్నాను.

'నీకు ధైర్యముంటే అల్లాగే పదినా' అన్నాడు. పగలైతే వూళ్ళోవాళ్ళు చూస్తారని రాత్రిళ్ళు నేర్చ మన్నాను. మొదట్లో పడిపోతానని భయం వేస్తుంటే వాడు వెనక 'కేరేజీ'పై కూర్చుని తొక్కించేవాడు. వాడు వెనక కూర్చుంటే అదోలా వుండేది.. కొన్నిసార్లు భయం పోవటానికని వాడు ముందు కడ్డీ మీద నన్ను కూర్చోబెట్టి శుభ్రంగా సీటు మీద తను కూర్చుని గంటల తరబడి ఇంటి చుట్టూ తిప్పేవాడు. అలా కూర్చున్నప్పుడు ఆ స్పీడుకు ఏమో బుర్ర తేలిపోయినట్లుండేది.. రెండు ప్రక్కలా వాడి చేతులుండేవి.. వాడి కాళ్ళు పెడలు మీద ఎక్కుతూ దిగుతూ నా కాళ్ళకు తగులు తుండేవి..

అనక ఓ రోజు స్పీడుగా తొక్కటం వచ్చేసిం దనుకుని వాడు వెనక సైకిలు పట్టుకోకుండా వదిలేశాడు. నాకు బ్రేకులు పళ్ళేదు.. వెళ్ళి పాడి గేదె కట్టుగొయ్య మీద పడిపోయాను. ఆ తర్వాత నాకు స్పృహ లేదు. దెబ్బ చిన్నదే కావొచ్చు కాని భయం వల్ల ఏమీ తెలియలేదు. లేచి చూసుకునే టప్పటికి సూర్యం ప్రక్క మీది నుంచి హడావుడిగా వెళ్ళి తలుపు తీశాడు.. తెనాలి నుంచి లాస్టు బస్సుకు వచ్చిన మునసబుగారు నిలబడి వున్నాడట. వచ్చి ఎంతసేపయిందో తెలియదు.. సూర్యం సైకిలు

> ఇరవయ్యేళ్ళ ఆడదాన్ని రాత్రుల కంటే పగలే బాగుందనిపించేది... ఈవాడయితే పొద్దు గూకితే ఇల్లాలూ ఇంటాయనా ఎంత ముచ్చటగా వుంటారు... రాత్రంటే బెంగ పట్టుకునేది... నిద్దెక్కనే గానీ ఎంతకీ తెల్లారేది కాదు... ఆయన పట్నంల్లో ఏవో రాసుకుంటూ వుంటే పడకటింట్లో నేనుండేదాన్ని... నాలు కుర్చీలో అలాగే నిద్ర పోయేవాడు... ఆయ నకు నాలు కుర్చీనే పెళ్ళాం అను కునేదాన్ని

తీసుకుని వెళ్ళిపోయాడు. ఈయన లోపలికొచ్చి నా వంక ఎగాదిగా చూసి వెళ్ళి పడక కుర్చీలో పడు కుండిపోయాడు.

అన్నానికి లేనమని ఎందుకడగలేదో నాకూ తెలియదు!

* * *

మరునాటిరోజు నుంచీ యింటికి మనుషులు రావటం 'బందు' అయిపోయారు. ఆయన పల కటం మానివేశాడు. ఇంటికి రాగానే కాళ్ళకు నీళ్ళియ్యాలి. వేన్నీళ్ళు తోడితే స్నానం. అన్నం వడ్డిస్తే తినటం.. ఏదన్నా కావాలంటే చెంచాలో గ్లాసు ప్రమోగించేవాడు. అంతే. చెయ్యి కడుక్కుని పోయి పడుకోవటం.. ఇదివరల్లో రాత్రుళ్ళు ఒళ్ళు కదిలినట్లుండేదని చెప్పానా.. అదీ లేదు ఆ తర్వాత.. నాకూ నిద్ర తగ్గిపోయింది.. ఇహంతే.. ఇంటి

నాసాలు చూస్తూ పడుకునేదాన్ని. ఎప్పుడన్నా సూర్యం కనబడితే బావున్ను అనిపించేది.. సూర్యం కాదు.. సూర్యుడు కూడా కనపడటం మాని వేశాడు.

అట్లాగ పది ఏళ్ళు గడిచాయి.. ఇహ నాకు పిల్లలు పుట్టరని ప్రకాశరావుని దత్తు చేసుకున్నాడు మునసబుగారు. అప్పటికి వాడికి పదిహేను ఏళ్ళ వయసుంటుంది. వాడు కూడా నన్ను అమ్మా అనిపిలిచేవాడు కాదు. 'ఇదిగో'.. 'ఏన్నే'.. అనే వాడు.. పోన్లే మాటామంతీ లేకపోయినా ఇంకో మనిషి యింట్లో వున్నాడు. అంతేచాలు అనుకునే దాన్ని. మాటయితే లేదు కాని వాడు యితరుల్తో మాత్రం 'మా అమ్మ' అంటుంటే నాకు ఎంత ప్రేమగా వుండేదో!

వాడి కోసం రకరకాల వంటకాలు చేసేదాన్ని.. కొరి కొరి వడ్డించేదాన్ని. అన్నీ తిన్నా 'అమ్మా' అనడేమా అనుకునేదాన్ని. అయితే నా కోరిక వాడి పెళ్ళినాటికి తీరింది.

వాడికి పెళ్ళయి మూణ్ణెల్లు తిరక్కుండానే మునసబుగారు కాలం చేసేడు. ప్రకాశం బి.ఎ. చదువుకోవటానికి గుంటూరు వెళ్ళాల్సి వచ్చింది. కోడల్ని తీసుకెళితే చదువు సాగదని నన్నే తీసుకుని గుంటూర్లో వంట బెట్టించాడు.

గుంటూరు ఏ ముహూర్తాన వచ్చానో నా బందిఖానా తీరిపోయింది. వాడు కూడా 'అమ్మా' అనటం ప్రారంభించాడు. వచ్చేపోయే స్నేహితుల్తో ఇల్లు కళకళలాడేది. వాడికి చదువయిపోయిం తర్వాత హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. సుందరి కాపరానికొచ్చింది. వాళ్ళిద్దరూ చిలకా గోరింకల్లా వుంటూ వుంటే నాకు ఈ బ్రతుకు చాలనిపించింది. మునసబుగారితో కాపరం గుర్తొచ్చి నవ్వొచ్చేది. సుందరీ.. సుందరీ అంటూ అదేదో సినిమాల్లోలాగా వాడు అస్తమానూ దాని కొంగు పట్టుకుని తిరుగుతుంటే నా కడే పది వేలు అనిపించింది. సినిమాలు, షికార్లు, స్నేహితులు, క్లబ్బులు, పేకాట, త్రాగుడు పార్టీలూ. వాడు ఎన్ని చేసినా నాకు బాధ వేసేది కాదు. పెళ్ళాన్ని బాగా చూసుకుంటున్న మొగుడు ఎన్ని చేస్తే యేం.. పైగా సుందరికి అవన్నీ యిష్టమేనట.. ఆ పిల్లకు నేనంటే చాలా గౌరవం.. ఒకసారి ఏమందో తెలుసా..

"అదేమిటి అత్తయ్యగారూ అందరూ కోడళ్ళను రాచి రంపాన పెడతారట.. మీరేమిటి సినిమా కెళ్ళండి.. షికారుకెళ్ళండి అని తరుముతా రేమిటి.." అంది.

"నా కాపరం కథ నీకు తెలియదమ్మాయ్.. నీ ఆయనకీ తెలియదు.. వాడు నా యింట్లో పెరగ లేదు కదా.. అందుకని నీ కాపరం ముచ్చటగా వుంటే నాకానందమే.." అనేదాన్ని. "అది కాదు

లెండి.. మీరు యాయమ్మ కనలేదు.. అందుకని అంత ప్రేమ మా మీద.. సొంత తల్లి అయితే నన్ను హింసపెట్టేదేమో" అనేది.. "ఏమోనమ్మా అవన్నీ నాకు తెలియవు" అని నవ్వేదాన్ని.

* * *

అంతా బాగే వుంది కానీ.. యిప్పుడు నాకు అరవయ్యో ఏడు.. కాలం మారింది. నిజమే.. కాని కాలం మారినా మనుషులు మారకపోవచ్చు గదా.. చుట్టూ కొన్ని సంగతులు వింటుంటే మరీ భయమేస్తుంది.. ఏమో ప్రకాశమూ మునసబుగారిలా మారతాడేమో.. రక్తంలో మంచి వచ్చినవాడు కాదనుకోండి.. ఏమయినా భయం భయమే.

సుందరి మావాణ్ణి సతపోరి కారు కొనిపించింది. అది బుల్లిగా పెట్టెలాగా వుంది. లోపలి వాళ్ళకు బయట కన్పిస్తుంది కాని మనకి కూచున్న వాళ్ళు కన్పించరు. మావాడికి కారు నడపటం రాదు. సుందరి నేర్చుకుంటానంది. వాడి స్నేహితుడు సురేష్‌బాబు చేత సుందరికి నేర్పిస్తున్నాడు!

అతను మా సుందరి చేతి మీద చెయ్యి వేసి చక్రం పట్టుకోవటం నేర్పుతుంటే నాకు మనస్సు చివుక్కుమంది.

అతను మా సుందరి ప్రక్కనే కూర్చుని భుజాలు రాసుకుంటుంటే నాకు ఒళ్ళంతా ఒణికింది.

**కాలం మారిందిగానీ మనుషులు మారారో లేదో అని నా బెంగ. కాలం మారనప్పుడే మూర్ఖం మనసు అలా పని చేసింది! ఇప్పటి సురేషు పిల్లవాడు అలా కాదంటారా? నా అనుభవానికి అసలు విలువే లేదంటారా?**

చీకటి అద్దాలు వేసుకుని వాళ్ళు ఎటెటో వెళ్ళిపోతుంటే మావాడు అలా చూసి నవ్వుతాడేమిటే అని నాకు ప్రాణం గిజగిజలాడింది.

'అబ్బాయి.. యిది బాగోలేదురా నాయనా.. పోనీ ముందు నువ్వు నేర్చుకుని తర్వాత తనకు నేర్పు నాయనా.. అతను పరాయి మనిషి గదా" అన్నాను.

"ఏమిటమ్మా నీ భయం" అని పక్కున నవ్వేశాడు వాడు.

ఆ నవ్వు విని సుందరి 'ఏమిటండీ' అని అడిగి తెలుసుకుంది. ఇద్దరూ నవ్వుకున్నారు సైగా. సుందరి నవ్వాపుకుంటూ—

"అత్తయ్యగారూ.. మీ అబ్బాయిని వదిలి నేను సురేష్‌ని చేసుకోను సరేనా" అని మళ్ళీ నవ్వటం..

నాకయితే ఆ మాటలు జెర్రుల్లా ప్రాకి ఒళ్ళంతా గగుర్పొడిచినట్లనిపించాయి.


మొన్న పది రోజులు ముగ్గురూ కార్లో యాత్రకని పోయారు. వెళ్ళినవాళ్ళు కలిసి రావొచ్చునా.. వీడు సెలవు లేదని ముందుగా వచ్చాడు. ఆనక నాలుగు రోజులకు గానీ ఆ పిల్లలిద్దరూ రాలేదు.

కాలం మారింది గానీ మనుషులు మారారో లేదో అని నా బెంగ! కాలం మారనప్పుడే మూర్ఖం మనసు అలా పని చేసింది.. ఇప్పటి సురేషు పిల్లవాడు అలా కాదంటారా? నా అనుభవానికి అసలు విలువే లేదంటారా?

మునసబుగారూ, ప్రకాశమూ ఒకటి కాకపోవచ్చు.. కానీ.. కానీ.. సుందరి కళ్ళల్లోకి చూస్తూనే వున్నాను. సైకిలు మీద పడిపోయిన రాత్రి నా కెంత సంతోషంగా వుందో.. దాని కళ్ళూ అలాగే వుంటున్నాయి.. కథ వింటున్న మీకు చెప్పేటంత దాన్ని కాను.. చదువురాని దాన్ని... అయినా ఆడమనిషిని కదా.. ఆడ మనస్సు ఎలా వుంటుందో.. అదీ మీకే తెలుసంటే మరి నేనేం చెప్పను!! ●

FIBROFLEX
● పరుపులు
● దిండ్లు
● కుషన్లు
IS : 8391

ఒక నూతన జీవనశైలికి మార్గదర్శి
ఒక జీవితపర్యంతపు పరుపు
శరీర సౌఖ్యానికి సాటిలేనిది



మృదువైనది ♦ సుఖకరమైనది ♦ నాణ్యమైనది

తయారుచేయువారు :
భారత్ మోటార్స్
151, మౌంట్ రోడ్డు
మద్రాసు 600 002
ఫోను : 865512, 861923
గ్రాములు : FIBROFLEX
టెలెక్స్ : 041-6136-BM-IN

బ్రాంచి ఆఫీసు :
26-3-64,
నాగేశ్వరరావు పంతులు రోడ్డు
గాంధీ నగరం
విజయవాడ 520 003

ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదార్లు :
ది సెంచరీ ట్రేడింగ్ కంపెనీ
26-22-25, ముదునూరువారి వీధి
గాంధీ నగరం
విజయవాడ 520 003
ఫోను : 74261

EXELADS/BM 669/90 (Tel)